

వరండాలో
లక్కీతో కబుర్లాడుతున్న
ఇంజనీర్ రాజారావు
మైహోల్స్ హడావుడికి
తలెత్తాడు.
మెట్లమీద లెఫ్ట్‌రైట్
చేస్తూంది నివేదిత

పసిమి వన్నె, గుండ్రని ముఖం, వెడల్పాటి కన్నులు, క్రిందగా నల్లరంగు పెదాలకు ఎర్రరంగు, మొఖంమీద లేలేత రోజారంగు పులుముకొన్నట్లు స్ఫుటంగా కన్పిస్తోంది. వయసు సుమారు ఇరవై వసంతా లుండొచ్చు. చేతులకి గాజుల్లేవు. ఒకచేతికి రిస్ట్‌వాచ్. కత్తెరించుకొని నుదుటిమీదకు తెచ్చుకొన్న రెండంగుళాల వెంట్రుకలు కొన్ని నల్లగా, నాట్యం చేస్తున్నాయి.

"డాడీ . " అని పిలిచింది నివేదిత.

"ఏమ్మా?" రాజారావు పక్కా అంద్రుడు.

"షాపింగుకు వెడదామన్నావ్..."

"ఔనౌను, మర్చిపోయాను. మెషర్‌మెంట్స్‌తో తల వేడెక్కి అనుకొన్నవి కాస్తా ఆవిరై పోతున్నా యీమధ్య;"– నవ్వుతూ అన్నారు రాజారావుగారు.

నివేదిత నవ్వలేదు. గారేజికేసి వడి వడిగానడచి, కారు బయటకుతీసి, హారన్ వాయించడం మొదలుపెట్టింది. రాజా రావుగారు వాష్‌కోటు తొడుక్కొని హాండ్ స్టిక్ వూపుకుంటూ వెనుకడోర్ తెరిచాడు.

కారు చక్రాలకు మల్లే ఆలోచనలు సుడులు తిరుగుతున్నాయి నివేదితలో. ప్రతీకారంకోసం ఆమె అణువణువూ వుడికిపోతూంది.

"ఎలాటి చీర కావాలమ్మా?"

"నే సెలక్టు చేసికుంటాలే–" నిశ్చలంగా అంది నివేదిత. ఆమెను ఎదిరించే హక్కు తనభార్య చనిపోయినప్పుడే పోగొట్టుకున్నాడు రాజారావు.

'మూవింగ్ కెమేరా'లా కదిలింది మనస్సు......

"రజీ, యీ చీర ఎంత?" రజియా పమిటను వేళ్ళమధ్య నలుపుతూ అడిగింది నివేదిత.

"మా నాన్న డార్జిలింగ్ నుండి తెచ్చారు."

"అలానా? ఎంత?" మామూలుగా అడిగింది.

"మన ఏ.పి.లో యిలాంటి చీరలు దొరకవు;" – నవ్వుతూ అంది రజియా.

"న్యూడిజైనన్నమాట – ఎంతేంటి?"

"అమెరికాలో యీ చీరలమీద మోజెక్కువట;"– నివేదిత మనస్సు చివుక్కుమంది. ఓర్పుఆవిరైపోయింది.

"కాస్ట్ ప్లీజ్...?" పండ్లు బిగబట్టి అడిగింది.

"రెండున్నర..." వెళ్ళిపోతూ ధీమాగా అంది రజియా.

"ఓస్... ఆఫ్‌ట్రాల్ రెండువందల యీ ఖై...ఫ్..." పోతున్న రజియాకు విన్పించేలా అంది. ఆమె కది విన్పించ లేదో, లేక అలా నిర్లక్ష్యం చెయ్యాలని చేసిందో నివేదిత కంతుబట్టలేదు. ఆమె నిర్లక్ష్యాన్ని మాత్రం సహించలేక పోయింది. తండ్రిని షాపింగ్‌కు బయల్దేర దీసేదాకా ఆమె మనస్సు ఆమెలో లేదు.

* * *

'డిజైన్స్ క్లాత్ పాలెస్' ముందు కారాగింది. రాజారావు జేబు తడుంకుంటూ

దిగాడు. సేల్స్‌మెన్ ప్రక్కకు తొలిగాడు.

ప్రొప్రయిటర్ లక్ష్మీదాస్ ఎదురుగా వచ్చాడు. 'శారీస్ కార్నర్'లో ఫాన్ తిరగటం మొదలయింది. గుట్టలు పడ్తున్నాయి చీరలు – మడతలు విప్పుతూ మూతి విరుస్తున్నది నివేదిత. సేల్స్‌మెన్ వాటిని ప్రక్కకు విసిరేస్తూ క్రొత్తవి తెస్తున్నారు. అన్నిచీరల్లోనూ ఓ చీర ధరనే అడిగింది:

"రెండూ యాభై;" ప్రొప్రయిటర్ చెప్పాడు.

"యింకా ఖరీదు కావాలి"–

సేఠ్ లక్ష్మీదాస్ తల గోక్కుంటూ "లేవండీ, మీ రాష్ట్రిప్పిస్తే తెచ్చి పంపిస్తాను," అన్నాడు.

తల అడ్డంగా వూపి అద్దాల బీరువాల్లో రంగుల్లో మెరుస్తున్న రకరకాలకేసి ఓసారి చూసి పెదవివిరుస్తూ నిట్టూర్చింది.

"వెల్దాం డాడీ"

"బిల్లెంత–?" పేపరు లోకంలోంచి అప్పుడే వచ్చాడు రాజారావు.

"చీర ల్లేవు;" బయటకు నడిచింది.

రాజారావు బీరువాలకేసి చూశాడు. సేల్స్‌మెన్ చెదురైన చీరెలమడతలు సరిచేసుకుంటున్నారు. నివేదిత ననుసరిస్తున్న రాజారావుగారిని సాగనంపుతున్న లక్ష్మీదాస్‌క్షమాపణలు వేడుకొంటున్నాడు

కారు సెంటర్‌కేసి కదిలింది. రాజారావుకి తెలుసు బిడపట్టుదల. తల్లీ తండ్రీ తనే కాబట్టి నివేదిత మురిపెం రెండంతలయింది.

"పబ్లిక్ బూత్ దగ్గర కారాపు తల్లీ."

"ఎందుకు డాడీ?"

"మోడల్ క్లాత్ ఎంపోరియంలో వున్నాయేమో కనుక్కుంటాను."

కారాపింది నివేదిత. దిగుతున్న తండ్రితో– "న్యూ డిజైన్స్‌డాడీ" అంది.

రాజారావుగారు తలూపి బూత్‌లోకి నడిచాడు.

"వున్నాయా డాడీ?" తిరిగొచ్చిన తండ్రి నడిగింది.

"వున్నాయిటమ్మా; నిన్ననే కాశ్మీర్ నుండి వచ్చాయట, న్యూ డిజైన్స్."

"వెరీ లక్కీ..." గట్టిగా నొక్కింది యాక్సిలేటర్‌ని!

* * *

'మోడల్‌క్లాత్' ఎంపోరియం ముందు ప్రొప్రయిటర్ మాణిక్యరావు నిల్చొని సాదరంగా ఆహ్వానించాడు. అంతకు ముందే తెప్పించిన 'బోర్న్‌విటా'ను ముందుంచాడు. సిప్ చేస్తున్న నివేదిత కళ్ళు బీరువాలకేసి చూస్తున్నాయి.

"ఏవీ కాశ్మీర్ డిజైన్స్?"

షోకార్నర్‌లోకి నడిచాడు మాణిక్యరావు. రకరకాల చీరెలు, రంగురంగుల డిజైన్స్. కాలేజీలో ఎవరికీ లేనిచీరలు,– నివేదిద మనస్సు వుప్పొంగింది; రజియాకేసి ధీమాగా చూసింది.

"ఈ చీర ఎంత?"

"ఐదొందలండీ–" యింకా ఖరీదు కావాలామ్మా?"



"అక్కర్లేదు, దీన్ని పాక్ చేయండి."

సేల్స్‌మెన్ పార్సిల్ కార్లో వుంచాడు. రాజారావు ఐవొందలిచ్చి, అందరి నమస్కారాలు అందుకొని కారుకేసి నడిచాడు.

నివేదిత హృదయం వుప్పొంగి పోతూంది. పూర్ ఫెలో, ధరడిగితే మిడ్పి పడింది. రేపు తనూ చూపాలి ప్రతాపం,

*　　*　　*

మరునాడు నివేదిత కాలేజీలో ఏం చేసిందో కాని రాజారావుగారు మాత్రం, ఆఫీసు కెల్తూ 'మోడల్ క్లాత్ ఎంపోరియం'లో నాలుగొందలరూపాయలు తిరిగి తీసికొంటుంటే– ప్రొప్రయిటర్ మాణిక్యరావు నవ్వుతూ "అమ్మాయిగారు నిజంగా ఆ చీర ఐదొందలనుకున్నారండీ..." అన్నాడు. రాజారావు చిన్నగా నవ్వాడు.